క్లుప్తంగా

విధులను సమర్థంగా నిర్వహించండి

ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి



కోనేరుసెంటర్: కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సిబ్బంది విధులను సమర్థంగా నిర్వహించాలని ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఆకాంక్షించారు. జిల్లాలో ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా వివిధ స్టేషన్లలో బాధ్యతలు స్వీకరించిన ఎస్సైలు సోమవారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సిబ్బందిని అభినందించిన ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అసాంఘిక శక్తుల అణచివేతకు నిరంతరం కృషి చేయాలని తెలిపారు. నిజాయతీతో ప్రజలకు సేవ చేయాలని సూచించారు. ఎస్పీని కలిసిన వారిలో కంకిపాడు, పమిడిముక్కల, కూచిపూడి ఎస్సైలు డి.సందీప్, కె.శ్రీనివాసరావు, కె. శ్రీనివాస్ ఉన్నారు.

ఉత్తమ అధికారులకు ఘన సత్కారం



కోడూరు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మెరిటోరియల్ సర్టిఫికెట్ అందుకున్న అధికారులను మండల పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. కలెక్టర్ రాజాబాబు చేతుల మీదగా ప్రశంసాపత్రం అందుకున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ నాగరేవతి, ఏపీఎం శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజరాజేశ్వరిలను జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారిలు శాలువాలు కప్పి సత్కరించారు. కోడూరు తహసీల్దార్‌గా ఇటీవల విధుల్లో చేరిన శ్రీనివాసరావును కూడా ప్రజాప్రతినిధులు సత్కరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, వైస్ ఎంపీపీ ముక్కు వెంకటేశ్వరరావు, ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు, ఏఓ పాండురంగారావు, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.


ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నాగాయలంక: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్థానిక ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. ఆయన ఆధ్వర్యాన నాగాయలంక ప్రధానకూడలిలో సోమవారం రాత్రి ట్రాఫిక్ నిబంధనలు, మైనర్లకు వాహనాలు ఇవ్వడం, జరిమానాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. త్వరలో ఎన్నికల నిబంధనలు అమల్లోకి రానుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి వివాదాల్లోకి పోకుండా మండలంలో ఎన్నికల ప్రక్రియ శాంతియుతంగా జరగడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇచ్చి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ఎస్‌ఐ కోరారు. పరిమితికి మించి నడిపే ఆటోల్లో ప్రయాణించడం శ్రేయస్కరం కాదని ప్రజలు గుర్తించాలన్నారు. ఏఎస్‌ఐ తుంగల ప్రసాద్, పోలీసు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

కీచక ఉపాధ్యాయుడిపై స్పందనలో ఫిర్యాదు

అవనిగడ్డ: బాలిక ఆత్మహత్యకు కారణమైన కీచక ఉపాధ్యాయుడిపై సోమవారం మచిలీపట్నంలో జరిగిన స్పందనలో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. వేకనూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ఈనెల 6వ తేదీన ఇంటి వద్ద ఆత్మహత్య చేసుకుంది. ఆ తర్వాత హైస్కూల్లో పనిచేసే ఓ ఉపాధ్యాయుడు సెలవు పెట్టినట్టు తెలియడంతో తల్లిదండ్రులు ఆరా తీశారు. విద్యార్థిని ఆ ఉపాధ్యాయుడు నిత్యం వేధించేవాడని, అసభ్యంగా ప్రవర్తించేవాడని, లైంగిక వేధింపులకు పాల్పడేవాడని తెలిసింది. దీంతో మైనర్ కుటుంబ సభ్యులు స్పందనలో కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై విచారణ చేసి కారకుడైన ఉపాధ్యాయుడిపై చర్య తీసుకోవాలని బాలిక కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

సాయం సంధ్యా సోయగం



నాగాయలంక: స్థానిక శ్రీరామపాదక్షేత్రం కృష్ణాతీరంలో పడమటి దిక్కున సాయం సంధ్యా సమయంలో వివిధ రీతుల్లో ఆకట్టుకునే సూర్యాస్తమయ దృశ్యం సోమవారం అరుణ కాంతులతో వీక్షకులను అలరించింది. సాయం సంధ్యా సోయగంతో స్థానికులు ఆనందించారు. కొందరు మొబైల్ ఫోన్లతో సెల్ఫీలు, ఫొటోలు తీసుకోవడం కనిపించింది.

అర్హులైన రైతులకు రుణాలు

- అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- విశ్వనాథపల్లి పీఏసీఎస్ ఛైర్మన్‌గా దుర్గారావు ప్రమాణ స్వీకారం



దుర్గారావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, కడవకొల్లు

కోడూరు: కులమతాలు, పార్టీలకతీతంగా అర్హులైన రైతులందరికీ పంట రుణాలను మంజూరు చేయడానికి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సభ్యులు, అధికారులు పని చేయాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. విశ్వనాథపల్లి పీఏసీఎస్ వద్ద సోమవారం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార సభను నిర్వహించారు. సంఘ సీఈఓ చుండూరు రమేష్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథి ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడారు. కృష్ణా సహకార బ్యాంకు ద్వారా రైతులకు వివిధ రకాల రుణాలను మంజూరు చేస్తూ ఆర్థిక తోడ్పాటునిస్తున్నారని చెప్పారు. సహకార బ్యాంకు ద్వారా డ్వాక్రా మహిళలకు గరిష్టంగా రూ.15లక్షల వరకు రుణాన్ని అందిస్తున్నారని తెలిపారు. విదేశాలకు వెళ్లి చదువుకొనే విద్యార్థులకు లోన్లు మంజూరు చేస్తూ గ్రామీణ స్థాయిలోనే ప్రజలకు అన్ని రకాల బ్యాంకింగ్ సేవలను సత్వరమే అందిస్తున్నట్లు వివరించారు. సహకార వ్యవస్థకు రైతులే రాజు అని, రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంక్ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. పీఏసీఎస్‌ల్లో ప్రస్తుతం ఉన్న త్రిసభ్య కమిటీ సభ్యులు సంఘ సిబ్బందితో కలిసి పని చేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని రమేష్‌బాబు కోరారు.

చైర్మన్‌గా దుర్గారావు ప్రమాణ స్వీకారం

సంఘ చైర్మన్, స్థానికుడు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ తోట దుర్గారావు ప్రమాణ స్వీకారం చేశారు. దుర్గారావుతో పాటు పర్సన్లుగా నియమితులైన వెంకటేశ్వరరావు, వీరరాఘవయ్యను శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. తొలుత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ రైతు విభాగం ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు చిట్టిప్రోలు బ్రహ్మరావు, కటకం కుటుంబరావు, లాల్‌బహదూర్‌శాస్త్రి, రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, సచివాలయాల మండల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, సర్పంచి యలవర్తి నాంచారయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- పెదపట్నంలో వైఎస్సార్ సీపీ బందరు ఇన్‌చార్జి పేర్ని కిట్టు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని వైఎస్సార్ సీపీ బందరు ఇన్‌చార్జి పేర్ని కిట్టు తెలిపారు. పెదపట్నం గ్రామంలో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. తొలుత గ్రామంలోని పాఠశాలను సందర్శించిన కిట్టు మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందుతున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో రూ. 10 లక్షలతో నిర్మించనున్న పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. 1.50 కోట్ల ఆర్ అండ్ బీ నిధులతో పెదపట్నం నుంచి శివాలయం వరకు నిర్మించనున్న రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. నియోజకవర్గంలో ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వంతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తున్న ఎమ్మెల్యే పేర్ని నానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచి అనూష, ఇన్‌చార్జి రాజు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ వేద వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి ఆలయంలో బహిరంగ వేలం



మోపిదేవి ఆలయంలో వేలం పాటలు జరుగుతున్న దృశ్యం

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో వివిధ కేటగిరీల్లో లైసెన్స్ హక్కు పొందడానికి సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం పాటలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు మాట్లాడుతూ ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు ఏడాది కాలపరిమితికి భక్తులు సమర్పించు కొబ్బరి చిప్పలు చల్లపల్లికి చెందిన పి.శ్రీనివాసరావు రూ. 11,88,999లకు అత్యధిక పాటకు దక్కించుకున్నారు. చెవిపోగులు కుట్టడానికి పారితోషికంగా టిక్కెట్టు ఒకటికి ఐదు రూపాయలు పొందేందుకు మోపిదేవికి చెందిన వెంకటేశ్వరమ్మ రూ. 6,01,000కు హెచ్చుపాట పాడినట్లు తెలిపారు. వాహనాల పార్కింగ్, షాపు నంబర్ 2లో పూజ ద్రవ్యాలు విక్రయం, భక్తుల పాదరక్షలు భద్రపరచడం, భక్తుల సామానుల క్లోక్‌రూం, భక్తులు సమర్పించిన చీరలు, పంచెలు పోగుచేసుకునే హక్కు, శ్రీ గోకులం వద్ద పచ్చ గడ్డి కట్టల విక్రయం, సీసీ కెమెరాల పర్యవేక్షణ, రిపేర్లు చేయడం, ఆవుల మేతకు తవుడు, ఉలవలు, తెలగపిండి సరఫరా చేయడం, ఖాళీ పెరుగు డబ్బాలు సరఫరా వంటి వాటికి ఔత్సాహికులు ముందుకు రాకపోవడంతో వాటిని వాయిదా వేసినట్లు ఆలయ ఏసీ వివరించారు. మచిలీపట్నం దేవదాయ శాఖ తనిఖీ అధికారి కె. శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, సిబ్బంది, పాటదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమష్టిగా 'గడప గడపకు మన ప్రభుత్వం'



మాట్లాడుతున్న ఎంపీపీ సంగా మధుసూదనరావు

గూడూరు: మండల కేంద్రం గూడూరులో మంగళవారం నిర్వహించనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరూ సమష్టిగా పనిచేయాలని ఎంపీపీ సంగా మధుసూదనరావు కోరారు. గూడూరులో నిర్వహించనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై స్థానిక వెలుగు కార్యాలయంలో వివిధ విభాగాల మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము ఆధ్వర్యాన గ్రామంలోని రజకపేట రామాలయం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ వేముల సురేష్‌రంగబాబు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, లింగం విజయ్‌కుమార్, ఆకూరి శ్రీనివాసరావు, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధి పనులు వేగవంతం

ఎంపీపీ రావి దుర్గావాణి



మండల పరిషత్ సమావేశంలో అభివృద్ధి పనులు వివరిస్తున్న దృశ్యం

మోపిదేవి: మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ రోడ్ల అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నట్లు ఎంపీపీ రావి దుర్గావాణి అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ దాదాపుగా సీసీ రోడ్లు పనులు పూర్తైనట్లు తెలిపారు. ఇంకా ఎక్కడా కావాలో తెలిపితే వాటి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. స్పందించిన ప్రజాప్రతినిధి నాగాయితిప్ప సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు గ్రామంలో శ్మశాన వాటికకు రహదారి వేయాలని కోరారు. కోసూరువారిపాలెం ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు గ్రామంలో అసంపూర్తిగా మిగిలిన సీసీ రోడ్డు పూర్తి చేయాలన్నారు. మెరకనపల్లిలో శ్మశాన వాటిక రహదారిపై రబ్బీస్ రోడ్డు వేయాలని ఆ గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు సూచించారు. ప్రభుత్వంలో జరుగుతున్న పలు రకాల అభివృద్ధిని ఆయా శాఖల అధికారులు వివరించారు. గ్రామ సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు రెండో విడత కొనసాగుతున్నట్లు డాక్టర్ అనిల్ తెలిపారు. లెప్రసీపై గ్రామాల్లో అవగాహన కలిగిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఏవో హెబ్సిబా రాణి మాట్లాడుతూ రైతులతో పాటు కౌలు రైతులకు ఇచ్చిన సీసీఆర్‌సీ కార్డుల ద్వారా బ్యాంకులు ఎకరాకు రూ. 30 వేలు రుణం అందిస్తున్నాయని తెలిపారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ నంద కిషోర్ మాట్లాడుతూ పశువులకు బీమా చేస్తున్నామని, రూ. లక్ష విలువైన పశువుకు రైతు రూ. 4,500 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఒక్కొక్క రైతు ఐదు పశువులకు బీమా చేయించుకోవచ్చని తెలిపారు. ఉద్యాన అధికారి బాలాజి మాట్లాడుతూ వెంకటాపురం గ్రామంలో సుమారు 250 మంది రైతులు కలెక్షన్ సెంటర్‌ను రూ. 15 లక్షలతో నెలకొల్పినట్లు చెప్పారు. ప్రభుత్వం ఒక్కో యూనిట్‌కు 50 శాతం సబ్సిడీ చెల్లిస్తుందని, అవసరమైన రైతులు సంప్రదించాలని సూచించారు. ఐసీడీఎస్ ఇన్‌చార్జి మండల సూపర్‌వైజర్ రత్నమాల మాట్లాడుతూ మండలంలో మొత్తం 31 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా పౌష్టికాహారం గర్భిణులు, పిల్లలకు రెగ్యులర్‌గా అందిస్తున్నామని, నాడు-నేడు కింద 23 కేంద్రాల్లో మరమ్మతులకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చినట్లు వివరించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు కడవకొల్లు సీతారామాంజనేయులు, నడకుదుటి జననీ కుమారి, ఎంపీడీఓ కె. శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



కోడూరు: బైక్ ప్రమాదంలో కుడి కాలికి తీవ్ర ఇన్ఫెక్షన్ సోకి అనారోగ్యానికి గురైన కోడూరుకు చెందిన గుత్తికొండ సుబ్రహ్మణ్యంకు టీఎస్సార్ గ్రూప్ అధినేత తిరుపతి శ్రీనివాసరావు చేయూతనందించారు. సుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులతో కలిసి బైక్‌పై వెళ్తుండగా మోపిదేవి వద్ద ప్రమాదానికి గురయ్యాడు. ఘటనలో సుబ్రహ్మణ్యంకు తీవ్ర గాయాలవ్వడంతో పాటు కాలుకు ఇన్ఫెక్షన్ సోకడంతో మంచానికే పరిమితమయ్యాడు. ప్రస్తుతం బాధిత కుటుంబం చల్లపల్లి మండలం రామానగరంలో నివసిస్తోంది. విషయం తెలుసుకున్న తిరుపతి శ్రీనివాసరావు బాధిత కుటుంబానికి నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యంతో పాటు దుస్తులను అందించారు. వైద్య ఖర్చులకు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభం



కోడూరు: కోడూరు ఎస్టీకాలనీలోని తొమ్మిద వార్డులో వాటర్ ట్యాంకు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. గ్రామ పంచాయతీ ద్వారా కేటాయించిన రూ. 5లక్షల నిధులతో ట్యాంకు పనులు ప్రారంభించారు. ఎంపీటీసీ తిమ్మన నాంచారయ్య, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, ఎస్సీసెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, నేతలు పాల్గొన్నారు.

చెరుకుమిల్లి మాజీ సర్పంచ్ మృతి



కృత్తివెన్ను: చెరుకుమిల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ పట్టపు సీతామహాలక్ష్మి (57) సోమవారం తెల్లవారుజామున మరణించారు. 2013-18 సంవత్సరాల్లో ఆమె సర్పంచ్‌గా చేశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె సోమవారం మరణించారు. ఆమెకు భర్త రాధాకృష్ణ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆమె మృతిపై పలువురు నాయకులు, అధికారులు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం ఆమె అంత్యక్రియలు చెరుకుమిల్లిలో జరిగాయి.

పేకాట శిబిరంపై దాడి

కంకిపాడు: పేకాట శిబిరంపై కంకిపాడు పోలీసులు సోమవారం దాడి చేశారు. ఎస్‌ఐ డి.సందీప్ తెలిపిన వివరాల మేరకు.. కంకిపాడు పట్టణంలోని శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందటంతో ఆ ప్రాంతంపై దాడి చేశారు. దాడిలో ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ 1420 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేశారు.

వైభవంగా విగ్రహ పునఃప్రతిష్ఠ



అభిషేకం నిర్వహిస్తున్న దత్త విజయానంద స్వామి

ఉయ్యూరు: ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం అలవడుతుందని దత్తపీఠం ఉత్తరాధికారి శ్రీదత్తవిజయానంద స్వామి అన్నారు. మండలంలోని గండిగుంట శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ సోమవారం వైభవంగా నిర్వహించారు. దత్తపీఠం ఉత్తరాధికారి శ్రీదత్త విజయానంద స్వామి శ్రీచక్రపూజ, ప్రతిష్ఠా హోమం, పూర్ణాహుతి నిర్వహించి శాస్త్రోక్తంగా కార్యసిద్ధి ఆంజనేయ స్వామి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. స్వామి వారికి అభిషేకం, పూజా కార్యక్రమాలు జరిపించారు. భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం నిత్యం పఠించాలన్నారు. మేనేజింగ్ ట్రస్టీ మంజుల, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి

మేయర్ వెంకటేశ్వరమ్మ



వర్క్‌షాప్ తర్వాత మహిళలతో మేయర్ వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్లు విజయలక్ష్మి, భారతి

మచిలీపట్నంటౌన్: మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ సూచించారు. నగరంలోని 25వ డివిజన్ జవ్వారుపేటలోని పట్టణ ప్రగతి యూనిట్‌లో భాగంగా కంప్యూటర్ ఎంబ్రాయిడరీ వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. మహిళల ఆర్థికాభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు వృత్తికోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తున్నారన్నారు. శిక్షణ పూర్తి చేసిన మహిళలు ప్రభుత్వం ఇచ్చే రుణాలతో యూనిట్లు ప్రారంభించి జీవనోపాధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, వైఎస్సార్ సీపీ 25వ డివిజన్ ఇన్‌చార్జ్ కొలుసు హరిబాబు, సీఎంఎం బసవేశ్వరరావు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి జగనన్న కృషి

ఉప్పాల రాము, హారిక



చినగొల్లపాలెంలో జగనన్న పథకాలను వివరిస్తున్న ఉప్పాల రాము, హారిక

కృత్తివెన్ను: ప్రజా సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఆయన నాయకత్వాన్ని బలపరుస్తూ మరోమారు ఆశీర్వదిద్దామని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. సోమవారం మండల పరిధిలోని చినగొల్లపాలెం, పడతడిక పంచాయతీల్లో ప్రజాదీవెన కార్యక్రమంలో పాల్గొన్నారు. వారిద్దరూ పార్టీ నాయకులతో కలసి ప్రతి గృహాన్ని సందర్శిస్తూ ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఫ్యాను గుర్తుపై ఓటు వేసి భవిష్యత్తు తరాలకు మరింత సంక్షేమాన్ని అందించే జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. తొలుత స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు తీసుకున్నారు.

అవ్వాతాతలతో ఆప్యాయంగా..

పింఛన్ నిరంతరం మీ గడపకు అందించే బాధ్యతను జగనన్న తీసుకుంటాడని జెడ్పీ చైర్‌పర్సన్ హారిక అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరిస్తూ వివరించారు. దీంతో వారు మా ఇంటి పెద్ద కొడుకు, మా ముద్దుల మనువడు జగన్‌మోహన్‌రెడ్డికి మరోమారు మా మద్దతు అంటూ సంతోషంగా చెప్పారు. స్థానికులు పలు సమస్యలను రాముకు తెలపగా ఆయన అప్పటికప్పుడు సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ మహేష్, ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, సర్పంచ్‌లు సునీల్, ప్రదీప్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ భూపతిరాజు, ఎంపీటీసీలు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఎంపీపీ వెంకటకుమారి



సర్వసభ్య సమావేశంలో శాఖల పనితీరును వివరిస్తున్న అధికారులు

కోడూరు: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా గ్రామాల్లోని అన్ని చెరువుల్లో పూర్తిస్థాయిలో నీటిని నింపినట్లు ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఎంపీడీఓ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని 13 పంచాయతీల పరిధిలో ఉన్న రక్షిత మంచినీటి చెరువులు, ఊరచెరువులకు నీటిని మళ్లించి, ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందిస్తున్నట్లు ఎంపీపీ తెలిపారు. తీరప్రాంత గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా ప్రత్యేక పైపులైన్లు ఏర్పాటు చేసి ఇంటింటికీ కుళాయి నిర్మాణం పూర్తైందని, వీటితో త్వరలోనే నీటిని సరఫరా చేస్తామన్నారు. కోడూరు-1, మందపాకల, పిట్టల్లంక, సాలెంపాలెం నూతన సచివాలయాల భవనాలను నాలుగు రోజుల్లో ప్రారంభించనున్నట్లు పీఆర్ ఏఈ విజయకుమార్ తెలిపారు. మిచాంగ్ తుఫాన్ కారణంగా వరిపంట నష్టపోయిన 4,750 మంది రైతులకు సంబంధించి 6,650 ఎకరాలకు ప్రభుత్వం త్వరలోనే నష్టపరిహారం అందిస్తుందని ఏఈఓ సురేష్ తెలిపారు. పంటపొలాల్లో మురుగు పారుదలకు దోహదపడే లింగన్నకోడు, రత్నకోడు డ్రైన్లలో పూడికతీత పనులను ప్రారంభించినట్లు డ్రైనేజీ ఏఈ కరీమ్ సభ దృష్టికి తీసుకువచ్చారు. వైఎస్సార్ ఆసరా ద్వారా నాలుగు విడతలుగా డ్వాక్రా మహిళలకు రూ.41.46కోట్ల రుణమాఫీ చేశారని ఏపీఎం శ్రీనివాసరావు తెలిపారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి స్వతంత్రపురం జెడ్పీ పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేస్తారని, పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు తెలిపారు. అనంతరం నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు, తాగునీటి పంపుల ఏర్పాటుకు సభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'గాలి కుంటు' వ్యాక్సిన్ పనితీరు పరిశీలన



పాడి పశువుల నమూనా సేకరణను పరిశీలిస్తున్న సహాయ సంచాలకురాలు సుజిని

పెడన: పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు ఇచ్చిన వ్యాక్సిన్ పనితీరును పరిశీలిస్తామని పశుసంవర్ధక శాఖ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల వ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకురాలు డాక్టర్ సుజిని అన్నారు. నెల క్రితం వ్యాక్సిన్ తీసుకున్న పెడనలోని పలు పశువుల నుంచి రక్తనమూనాలతో పాటు సీరం సేకరించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో సుమారు 3 లక్షలు వరకు పశువులున్నాయని, వీటిల్లో 80 శాతం పశువులకు 2.80లక్షల వ్యాక్సిన్లను జిల్లాలోని అన్ని వెటర్నరీ ఆసుపత్రులకు అందజేశామన్నారు. గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా వీటిని అందజేయడంతో పాడి రైతులు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఈ వ్యాధి సోకితే పాల దిగుబడి పడిపోతుందని, రైతులు ఆర్థికంగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందనే ఉద్దేశంతో ఈ వ్యాధి ప్రబలకుండా భారత ప్రభుత్వం వ్యాక్సిన్లను అందిస్తోందని తెలిపారు. వీటిని వేయకముందు పశువులు ఎలా ఉన్నాయి, వేసిన తరువాత అవి ఎలా ఉన్నాయనేదానిపై పరిశీలన చేస్తారన్నారు. ప్రస్తుతం ఎంపిక చేసిన పశువుల నుంచి మాత్రమే నమూనాలను సేకరిస్తున్నట్లు వివరించారు. ఆమెతో పాటు పెడన పశుసంవర్ధక శాఖ ఏడీ కొనకళ్ల బాబూరావు, క్యాడల్ ల్యాబ్ టెక్నీషియన్ భవాని తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రజ్ఞ వికాస పరీక్షలు

గుడివాడ టౌన్: పదో తరగతి విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించుకునేందుకు భారత్ విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు ప్రజ్ఞ వికాస పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేకంగా రూపొందించిన ఈ పరీక్ష పత్రాల్లో ఒక్కొక్క సబ్జెక్టుకు 10 మార్కుల చొప్పున ఉంటాయన్నారు. మొత్తం 100 మార్కులకు ఈ పేపర్ ఉంటుందని దీనిలో విద్యార్థులు సాధించిన మార్కులను బట్టి రానున్న పబ్లిక్ పరీక్షల్లో వారు ఏ మేరకు ఉత్తీర్ణత సాధించవచ్చో తెలుసుకునేందుకు ఇది ఒక నమూనా పరీక్ష అని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్ సమీర్ తెలిపారు.